ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

బుధవారం, 7 ఆగస్టు 2024 www.prajaaswaramdaily.com 4 PM

# నాగార్జునసాగర్ 22 గేట్లు ఎత్తివేత


హైదరాబాద్, ఆగస్టు 7 (ప్రజాస్వరం): నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి పెద్ద ఎత్తున నీరు సాగర్ కు వస్తోంది. దీంతో ప్రాజెక్టుకు సంబంధించిన 20 గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 3,23,965 క్యూసెక్కులుగానే నమోదవుతున్నది. సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 584.50 అడుగులకు చేరుకుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నిల్వ 295.99 టీఎంసీలకు చేరుకుంది. సాగర్ నుంచి భారీగా వరద దిగువకు వెళ్తుండటంతో సూర్యాపేట జిల్లాలోని పులిచింతల ప్రాజెక్టు క్రమంగా నిండుతున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు వద్ద 45.77 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికిగాను ప్రస్తుతం 26.79 టీఎంసీలకు చేరుకుంది. సాగర్ నుంచి వచ్చే వరదను బట్టి మరికొన్ని గేట్లు ఎత్తేందుకు అధికారుల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



# 48 గంటల్లో 46,546 ఫిర్యాదులు

**రుణమాఫీపై ఫిర్యాదు కోసం బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన నంబర్‌కి ఫిర్యాదుల వెల్లువ**

**పెద్ది సుదర్శన్ రెడ్డి**



హైదరాబాద్, ఆగస్టు 7 (ప్రజాస్వరం) : అర్హులై ఉండి రుణమాఫీ కాని రైతులు ఫిర్యాదు చేయాలని ఫోన్ నెంబర్ ఇస్తే వేలాది ఫోన్ కాల్స్, వాట్సాప్ మెసేజ్‌లు వచ్చాయని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. దాదాపు 3,500 ఫోన్ కాల్స్ వచ్చాయని.. 46,546 వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా రైతులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆధార్ కార్డులో చిన్న తప్పులు ఉన్నాయని రైతు రుణమాఫీ కావడం లేదని ఫిర్యాదులు అందాయన్నారు. కొందరికి వీసా ఉందని రైతు రుణ మాఫీ తిరస్కరిస్తున్నారని తెలిపారు. కొన్ని తండాల్లో భూ రికార్డులు సరిగా లేవని రుణ మాఫీ చేయడం లేదన్నారు. కేవలం దేవుళ్ళ మీద ఒట్లు వేశానని రేవంత్ రెడ్డి తూతూ మంత్రంగా రుణ మాఫీ చేస్తున్నారని విమర్శలు గుప్పించారు. రైతు పంట రుణాల ఆధారంగా అందరికీ రుణ మాఫీ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోందన్నారు. రైతు భరోసా, బోనస్ డబ్బులు మిగుల్చుకుని ఆ డబ్బులను రుణ మాఫీకి కేటాయించారన్నారు. రైతు భరోసా సమీక్షకు ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉపసంఘం విహార యాత్రలకే పరిమితమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణ మాఫీ కాని రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని తెలిపారు. త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తుందన్నారు. సివిల్ సప్లై కుంభ కోణంపై త్వరలోనే దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామని మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

కాగా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు రుణమాఫీ చేశారు. ఇప్పటి వరకు రెండు విడతల్లో రైతు రుణమాఫీకి నిధులను విడుదల చేసిన విషయం తెలిసిందే. రైతు రుణమాఫీ పథకంలో భాగంగా జులై 18న తొలి విడతగా లక్ష రూపాయలలోపు రుణాలున్న రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. రాష్ట్రంలో మొత్తం 11 లక్షల మంది రైతులకు రూ.6098 కోట్లు మాఫీ చేసింది. పన్నెండు రోజుల వ్యవధిలోనే రెండో విడతగా రైతు రుణమాఫీ నిధులను విడుదల చేసింది. రెండో విడతలో రూ. లక్ష నుంచి లక్షన్నర వరకు రుణమాఫీ కోసం.. రూ. 6,198 కోట్ల నిధులు విడుదల చేశారు. రెండో విడతను అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రారంభించారు. వేదికపై 17 మంది రైతులకు సీఎం చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. రైతు రుణమాఫీ చేయడంతో తమ జన్మ ధన్యమైందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ అన్నారు.

# ఉత్కంఠ..



- ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై ముగిసిన వాదనలు
- తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు
- కోర్టు ఆదేశాలపై ఉత్కంఠ

హైదరాబాద్, ఆగస్టు 7 (ప్రజాస్వరం) : పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేలా స్పీకర్ కు ఆదేశాలివ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్ పై జస్టిస్ విజయసేన్ రెడ్డి బెంచ్ బుధవారం విచారణ చేపట్టింది. అయితే, ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. కాగా, పార్టీ మారిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకట్రావు రాజకీయ లబ్ధి కోసమే పార్టీ మారారంటూ బీఆర్ఎస్ తరపు న్యాయవాది గండ్ర మోహన్ రావు తన వాదనలు వినిపించారు. అదేవిధంగా మూడు నెలల్లోపు ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకునేలా స్పీకర్ కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇక మణిపూర్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినప్పుడు ఆ రాష్ట్రాల్లోని కోర్టులు వెలువరించిన తీర్పులను ధర్మాసానికి విన్నవించారు. మణిపూర్ స్పీకర్కు అక్కడి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన కాపీని సైతం కోర్టుకు అందజేశారు. ఈ క్రమంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ స్పీకర్ కు న్యాయస్థానాలు స్పీకర్ ఆదేశాలు ఇవ్వడం వీలు పడదంటూ తన వాదనలు వినిపించారు. ప్రజల చేత ఎన్నికైన నాయకుల విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడం సాధ్యం కాదని కోర్టుకు తెలిపారు. ప్రభుత్వ తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి హాజరై ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ తగిన పరిశీలించి నిర్ణయం తీసుకునేందుకు మరికొంత సమయం పడుతుందని కోర్టుకు విన్నవించారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేస్తున్నామని తెలిపింది.



# వినేశ్.. నువ్వు ఛాంపియన్లకే ఛాంపియన్

## వినేశ్‌పై అనర్హత వేటు.. స్పందించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ప్రజాస్వరం) : ఒలింపిక్స్‌లో ఫైనల్ చేరిన రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు పడడంపై ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. వినేశ్.. నువ్వు చాంపియన్లకే చాంపియన్... నీవు భారత్‌కే గర్వకారణం. అలాగే ప్రతీ భారతీయకుడికి నీవు స్ఫూర్తిదాయం. ఈ రోజు నీకు తగిలిన ఎదురు దెబ్బ తనను బాగా బాధిస్తుంది. దీనిని వ్యక్తం చేసేందుకు తన వద్ద మాటలు సైతం లేవు. ఈ బాధ నుంచి తిరిగి బయటకు రాగలవని ఆశిస్తున్నాను. సవాళ్లను ఎదిరించడం నీకు తెలుసు. ఆ క్రమంలో నీకు అండగా మేముంటామన్నారు. 50 కేజీల విభాగంలో వినేశ్ ఫొగట్ నిర్ణీత బరువు పెరిగారు. ఉండాల్సిన బరువు కంటే 100 గ్రాములు పెరగడంతో వినేశ్‌పై అనర్హత వేటు పడింది. ఈ మేరకు పారిస్ ఒలింపిక్ నిర్వాహకులు ప్రకటించారు. వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు పడటంతో క్రీడాభిమానులు భారీ షాక్‌కు గురయ్యారు. బంగారు పతకం సాధించడానికి కేవలం అడుగు దూరంలో ఉండగా ఇలా జరిగిందని సర్వత్ర ఆవేదన వ్యక్తమవుతుంది.

# భద్రాచలానికి గండం

**ఏకధాటిగా కురుస్తున్న వర్షం**

**పోటెత్తిన గోదావరి**

**రామాలయం వరకు నీరు**



భద్రాచలం, ఆగస్టు 7 (ప్రజాస్వరం) : భద్రాచలంలో ఏకధాటిగా వర్షం కురుస్తోంది. దీంతో పరిసర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయం వద్దకు భారీగా వరదనీరు చేరింది. అన్నదాన సత్రం పక్కనే ఉన్న డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. పడమర మెట్ల వైపు మోకాలు లోతు నీరు చేరడంతో భక్తులు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. కరకట్ట వద్ద లూయిస్‌ను మూసి ఉంచడంతో వర్షపునీరు డ్రైనేజీ గుండా గోదావరిలో కలవడం లేదు. దీంతో కాంప్లెక్స్‌లో వర్షపునీటితో పాటు మురుగు చేరింది. కరకట్ట విస్తా కాంప్లెక్స్ వద్ద ఉన్న మోటార్లను ఆన్ చేయడంతో మురుగునీటిని డంపింగ్ చేస్తున్నారు. సమీపంలోని దుకాణాల్లోకి వర్షపునీరు చేరడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు.

### మంత్రి ఆగ్రహం

ఇరిగేషన్ అధికారులపై మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆగ్రహం

ఇరిగేషన్ అధికారులపై మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామాలయం అన్నదాన సత్రం వద్ద వరద నీరు నిలవడంపై మండిపడ్డారు. మంత్రి ఆదేశాలను గోదావరి నది కరకట్ట స్లూయిజ్ లాక్‌లను ఎత్తి పట్టణంలోని వర్షపు నీటిని గోదావరిలోకి ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. ఈ క్రమంలో ఉదయం నుంచి నీటిలో మునిగి వున్న రామాలయ ప్రాంతం వాసులకు ఉపశమనం కలిగనట్లైంది. కాగా.. గోదావరి నీటిమట్టం 33 అడుగులు ఉండటంతో లాక్‌లను అధికారులు ఎత్తివేశారు. మళ్లీ గోదావరి ప్రవాహం 36 అడుగులకు చేరితేనే లాకులను మూసివేయనున్నారు.



# అన్నీ పుకార్లే..

## బీజేపీలో.. బీఆర్ఎస్ విలీనం అంటూ ప్రచారం

### తేల్చేసిన మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్, ఆగస్టు 7 (ప్రజాస్వరం) : సోషల్ మీడియా వేదికగా బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీనం కాబోతోందంటూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. కాంగ్రెస్‌ను ఆపాలంటే ఓ జాతీయ పార్టీ సహకారం అవసరం అని బీఆర్ఎస్ భావిస్తున్నట్లుగా వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ పరిణామంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విటర్ వేదికగా సంచలన ట్వీట్ చేశారు.

'24 ఏళ్లుగా అఖుంటిత దీక్షతో వందలాది మంది విధ్వంసకారులు, తెలంగాణ వ్యతిరేక శక్తులతో బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తూనే ఉంది. మేం చాలా విజయాలు సాధించాం. అలుపెరగని పోరాటం చేసి, ప్రగతికి, గర్వ కారణంగా నిలిచిన రాష్ట్రాన్ని సాధించి నిర్మించుకున్నాం. రాష్ట్ర గుర్తింపు, అభివృద్ధి కోసం మాతో పాటు లక్షలాది హృదయాలు కలిసి కొట్టుకున్నాయి. రహస్య ఎజెండాతో, నిరాధారమైన పుకార్లతో మా పార్టీపై బురదజల్లే వారికి ఇదే చివరి హెచ్చరిక. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా అబద్ధాలను ప్రచారం చేస్తే.. బాధ్యులపై చట్టపరమైన చర్య తీసుకుంటాం. గత రెండు దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ సేవలందిస్తూనే ఉంటుంది. పడిపోతాం, లేస్తాం, పోరాడేది తెలంగాణ కోసమే.. మేము ఎన్నటికీ తలవంచం. జై తెలంగాణ..! అంటూ ట్వీట్ చేశారు.

## జాతీయ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో తేజస్‌కు కాంస్యం పతకం



హైదరాబాద్, ఆగస్టు 7 (ప్రజాస్వరం) : జాతీయ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్ తేజస్ కాంస్యం పతకం సాధించాడు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరుగుతున్న 40వ సబ్ జూనియర్, 50వ జూనియర్ జాతీయ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్ కుమార్ టీఎస్ తేజస్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. మంగళవారం జరిగిన 100 మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్‌లో స్విమ్మర్ తేజస్ 59:78 సెకన్లతో మూడో స్థానంలో నిలిచాడు. తేజస్ కాంస్య పతకం సాధించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర ట్వీట్ చేశారు. కాంస్య పతకం గెలుచుకున్న మన తెలంగాణ బిడ్డ తేజస్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున శుభాభినందనలు. నీ అద్భుత ప్రదర్శన తెలంగాణకు గర్వకారణం. భవిష్యత్‌లో కూడా ఇలాగే రాణించి, మరిన్ని విజయాలను సాధించేందుకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం నీకు అండగా ఉంటుందని పేర్కొన్నారు.

## యూట్యూబర్‌పై కత్తులతో దాడి

హైదరాబాద్, ఆగస్టు 7 (ప్రజాస్వరం) : మైలార్ దేవ్ పల్లిలో రౌడీ షీటర్ సోహెల్ అతని అనుచరులు రెచ్చిపోయారు. అర్ధరాత్రి యూటూబ్ ఛానెల్ రిపోర్టర్ మూబీన్ పై కత్తితో దాడి చేశారు. అడ్డుకోబోయిన వారి పై కూడా దాడి చేసి సోహెల్ గ్యాంగ్ అక్కడి నుంచి పరారైంది. ప్రస్తుతం మూబీన్ ఉస్మానియా ఆసుపత్రికిలో చికిత్స పొందుతున్నాడు. సోహెల్ గ్యాంగ్ అరాచకాలను మూబీన్ తన యూట్యాబ్ ఛానల్ లో టెలిక్యాస్ట్ చేశాడు. దీంతో సోహెల్ పగ బట్టినట్టుగా తెలుస్తోంది. యూట్యూబ్ నుంచి ఆ లింక్ తీసేస్తే సరి.. లేకపోతే చస్తావంటూ సొహెల్ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. వార్తకు సంబంధించిన లింక్ ను మూబీన్ తొలగించడం లేదు. దీంతో మూబీన్ పై కత్తులతో దాడి చేశారు. రౌడీ షీటర్ పై చర్యలు తీసుకోవాని జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం సొహెల్, అతని అనుచరులు పరారీలో ఉండగా మైలార్ దేవ్ పల్లి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్

### 9 మంది విద్యార్థుల పరిస్థితి విషమం

హైదరాబాద్, ఆగస్టు 7 (ప్రజాస్వరం) :: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల లోని ఓ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయింది. మధ్యాహ్న భోజనం తర్వాత ఈ ఘటన చోటు చేసుకోగా మొత్తం 40 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇందులో కలుషిత ఆహారం తిన్న 9 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఈ సమాచారం అందుకున్న అధికారులు విద్యార్థులను హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయిందనన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రి వద్దకు పరుగులు తీశారు.